సాక్షి ఒడిశా

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,55,251

బంగారం : 150 మిల్లీ గ్రాములు

వెండి : 13 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



బస్సు బైక్ ఢీ

మల్కన్‌గిరి జిల్లాలో బైక్ బస్సును ఢీకొంది. ఘటనలో ముగ్గురు చనిపోయారు.

- 8లో

ఒక రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ అభ్యర్థి సుజిత్ కుమార్ రాజీనామాతో రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయింది. దీని భర్తీ కోసం త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఉప ఎన్నిక పురస్కరించుకుని నామినేషన్ పత్రాలు దాఖలుకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల కమిషన్ అదనపు ఎన్నికల అధికారి బిద్యాధర మాఝి తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభం



పోటీ పడుతున్న క్రీడాకారులు

జయపురం: రాష్ట్రస్థాయి 43వ జిమ్నాస్టిక్స్ పోటీలు జయపురం పూల్‌బెడ ప్రాంతంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌర్యా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 80 మంది జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయక్, ఒలింపిక్స్ సభ్యులు అనూప్ కుమార్ పాత్రో, అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్ట్ రాకేష్ కుమార్ పాత్రో, రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అశోక్ మిశ్ర, ఫ్రాన్స్ నుంచి అతిదిగా విచ్చేసిన తిఎరి అయిమేస్, కొరాపుట్ జిల్లా క్రీడా సంఘ కోశాధికారి సంజయ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో కేంద్రీయ విద్యాలయం



కేంద్రీయ విద్యాలయం కోసం జయపురంలో నిర్మించిన తాత్కాలిక భవనం

జయపురం: ఎన్నో ఏళ్లగా జయపురం ప్రజలు డిమాండ్ చేస్తున్న కేంద్రీయ విద్యాలయం ఎట్టకేలకు ఏర్పాటు కానుంది. కేంద్రం ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్‌లో ప్రకటించింది. 2025-26 విద్యా సంవత్సరంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. ప్రతి విద్యా సంవత్సరంలో 900 మందికి పైగా విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. జయపురంలో ఈ విద్యాలయం కోసం 8 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.26 లక్షల ఖర్చుతో తాత్కాలిక భవనాలు కూడా నిర్మించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 30 యూనిట్ల రక్తం సేకరించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. బ్యాంక్ శాఖ మేనేజర్ కృష్ణ కిషోర్ సాహు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో యువకులు, బ్యాంకు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని సబ్ కలెక్టర్ కిరణ్ అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి సేవా భావాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. గుణుపూర్ సబ్ డివిజన్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుజాత గొమాంగో పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

టీబీ నివారణే లక్ష్యం



టీబీపై పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రాయగడ: టీబీ నివారణ చర్యల్లో భాగంగా జిల్లా వైద్య శాఖ వంద రోజుల టీబీ నివారణ అభిజాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా ఆరోగ్య శాఖ (పబ్లిక్ హెల్త్) అధికారి డాక్టర్ మమత చౌదరి ఆధ్వర్యంలో శనివారం స్థానిక బారిజోల వద్దగల జిల్లా ముఖ్య వైద్య శాఖ కార్యాలయం సమావేశం హాల్‌లో జరిగిన అభిజాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె టీబీ నివారణ, రోగి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై రూపొందించిన పోస్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత చౌదరి మాట్లాడుతూ టీబీ సంపూర్ణంగా నయమవుతుందని అన్నారు. గత ఐదేళ్లలో రోగుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ఈ నెల 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 24 వ తేదీ వరకు అంటే సుమారు వంద రోజుల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.








పలు వర్ణాల శీతల రక్షణ వస్త్రాలంకరణలో మూల విరాట్టులు

జగన్నాథునికి శీతల వస్త్రాలు

- శ్రీ మందిరంలో ఘుడొ లగ్గి ఉత్సవం



ఘుడొ లగ్గి ఉత్సవ పూజకు సిద్ధమైన పట్టు వస్త్రాలు

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో ఘుడొ లగ్గి ఉత్సవం ప్రత్యేకం. చలి నుంచి రక్షణ పొందడంలో మానవాళి జాగ్రత్తకు సంకేతం ఘుడొ లగ్గి ఉత్సవం . ఈ సందర్భంగా రత్న వేదికపై కొలువు దీరిన చతుర్ధా మూర్తులకు చలి రక్షణ వస్త్రాలతో అలంకరించడం ఆచారం. ఏడాది పొడవునా 12 నెలల్లో 13 ఉత్సవాలు జరుపుకునే స్వామిగా భాసిల్లుతున్న శ్రీ జగన్నాథుడు చలి కాలం సందర్భంగా ఘుడొ లగ్గి ఉత్సవం జరుపుకోవడం విశేషం. ఒడొణి షష్టిగా కూడా ప్రతీతి. జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని భారీ స్నానం ఆచరించి జ్వరంతో స్వామి మంచాన పడతాడు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం చందనం పూతతో చల్లబడతాడు. చలి కాలంలో శీతల తాకిడి నుంచి రక్షణ కోసం ముఖం మినహా శిరసు నుంచి నిలువెత్తున ప్రత్యేక వస్త్రాలతో కప్పుకుని ప్రత్యేక శోభని సంతరించుకుంటాడు. చతుర్ధా మూర్తులతో విమలా దేవి, శ్రీ దేవి, భూ దేవి, లక్ష్మి, మదన మోహనుడు శీతల రక్షణ వస్త్రాల్ని ధరిస్తారు.



ఘుడొ లగ్గి ఉత్సవ పూజకు సిద్ధం చేసిన నూలు వస్త్రాలు

చలి సంకేతం

మార్గశిర శుక్ల పంచమి నాటి రాత్రి చలితో స్వామి గజగజలాడడంతో మర్నాటి నుంచి శీతల రక్షణ వస్త్ర ధారణకు స్వామి సిద్ధం కావడం సాధారణ మానవాళికి చలి పెరిగినట్లు సంకేతం. ఏటా మార్గశిర శుక్ల షష్టి నుంచి మాఘ శుక్ల పంచమి (వసంత పంచమి) వరకు సుమారు 35 రోజులపాటు మూల విరాటులు ప్రత్యేక వస్త్ర ధారణతో చలి నుంచి రక్షణ పొందుతారు. ఈ వస్త్ర అలంకరణ ఘుడొ లగ్గిగా పేర్కొంటారు. పట్టు, మఖమల్, నూలు ఇతర రకాల వస్త్రాల్ని ఈ అలంకరణలో వినియోగిస్తారు. దర్జీ సేవకులు ప్రత్యేక శైలిలో మూల విరాటులకు అనుకూలంగా తీర్చి దిద్దుతారు. ఈ వస్త్రాలు 14 మూరల పొడవు, 3 మూరల వెడల్పు పరిమాణంతో సిద్ధం చేస్తారు. ఘుడొ లగ్గి ఉత్సవం ఆద్యంతం వారం రోజుల్లో రోజుకో రంగు చొప్పున సప్త వర్ణాల వస్త్రాల్ని వినియోగిస్తారు. రోజుకో రంగు వస్త్రాలంకరణతో స్వామి శోభాయమానంగా శోభిల్లి భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంటాడు. ఈ సందర్భంగా దేవుళ్లకు ప్రత్యేక నగలు, ఆభరణాలతో అలంకరిస్తారు. త్రిశఖ, కుండల, తడగి వంటి 7 రకాల ఆభరణాలు వినియోగిస్తారు.

రోజు	రంగు
ఆదివారం	ఎరుపు
సోమవారం	నల్లని అంచుతో తెల్లని వస్త్రాలు
మంగళ వారం	12 వన్నెల చారల వస్త్రాలు
బుధవారం	నీలి రంగు
గురువారం	పసుపు
శుక్రవారం	తెలుపు
శనివారం	నలుపు

శ్రీ మందిరం ప్రదక్షిణ

ఘుడొ లగ్గి ఉత్సవం కోసం సిద్ధం చేసిన ప్రత్యేక వస్త్రాల్ని ఆలయ ఆచారం ప్రకారం శ్రీ మందిరం ప్రాకార ప్రదక్షిణ నిర్వహిస్తారు. అనంతరం ఈ వస్త్రాల్ని పుష్పాలక్ సేవకులు మూల విరాట్లను అలంకరిస్తారు. ఇతర అనుబంధ సేవాదుల్లో పూజా పండా, పతి మహాపాత్రొ, ముదిరాస్తొ, ఘొంటొ, ఛొత్తొ, కహాలి సేవాయత్ వర్గాలు పాలుపంచుకుంటారు.

రాష్ట్రంలో లాభసాటిగా మద్యం విక్రయం

భువనేశ్వర్: రాష్ట్రంలో మద్యం విక్రయం గణనీయంగా పుంజుకుంది. రాష్ట్ర ఖజానాకు పుష్కల ఆదాయం చేకూరింది. ఈ మేరకు రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ శనివారం నాటి శీతా కాలం సమావేశాల్లో సభలో లిఖితపూర్వక జవాబు ప్రవేశ పెట్టారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మద్యం వ్యాపారం పుంజుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో విదేశీ మద్యం విక్రయం నుంచి రాష్ట్ర ఖజానాకు రూ. 5 కోట్ల 83 లక్షల 44 వేల ఆదాయం సమకూరింది. మరుసటి సంవత్సరం ఈ ఖాతా కింద రూ.5 కోట్ల 88 లక్షల 85 వేలకు పెరిగింది. గత ఏడాది 12 కోట్ల 9 లక్షల 67 వేల లీటర్ల విదేశీ మద్యం అమ్ముడుపోగా ఈ ఏడాది 15 కోట్ల 35 లక్షల 72 వేల లీటర్ల విదేశీ మద్యం విక్రయం జరిగింది. గత ఏడాది 84 లక్షల 37 వేల లీటర్ల నాటు సారా విక్రయం జరిగింది. ఈ ఏడాది మరింత పెరిగి 98 లక్షల 43 వేల లీటర్లు విక్రయించినట్లు జవాబులో పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అబ్కారి శాఖ సమగ్ర ఆదాయం రూ. 7 వేల 216 కోట్ల 99 లక్షలకు చేరింది. ఈ ఏడాది బర్‌గఢ్ జిల్లా నుంచి అత్యధిక అబ్కారి ఆదాయం ఖజానాకు చేరింది. తదుపరి స్థానంలో గంజాం జిల్లా నిలిచింది. బర్‌గఢ్ జిల్లా నుంచి రూ. 124 కోట్ల 99 లక్షలు లభించగా గంజాం జిల్లా నుంచి 96 కోట్ల 10 లక్షల ఆదాయం చేకూరింది.

సబ్సిడీలు సద్వినియోగం చేసుకోండి



ట్రాక్టరు కొనుగోలు చేసిన రైతుకు సబ్సిడీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ బిజయ్‌కుమార్

పర్లాకిమిడి: ముఖ్యమంత్రి కృషి ఉద్యోగ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో ఐదు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి వ్యవసాయ యంత్ర పనిముట్లు ముగింపు సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి కేవీకే (కృషి విజ్ఞాన కేంద్రం) వైజ్ఞానికులు ఆర్.ఉదయగిరి సంగ్రాం పరం గురు, ఉద్యాన వన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఎ.రాం ప్రసాద్ దాస్ తదితరులు పాల్గొన్నారు. ఆధునిక వ్యవసాయంలో రైతులు డ్రోన్స్ వినియోగించి కూడా క్రిమి సంహారక మందులు స్ప్రే చేస్తున్నారని, వ్యవసాయ కూలీలు లభ్యం కాని రోజుల్లో యంత్రాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, మెమెంటోలను కలెక్టర్ అందజేశారు. గుమ్మా, రాయఘడ, కాశీనగర్‌కు చెందిన రైతులు హైమంత్ రైయితో, దివాకర్ రౌతో, ఖగేశ్వర గౌడో, చిరుధాన్యాలు అధికంగా పండించిన మాతరిణీ యస్.హెచ్.జీ. గ్రూపు, గుమ్మాకు చెందిన మిలాన్ శోబోరోకు రూ.1.20 లక్షల సబ్సిడీ చెక్కులను కూడా అధికారులు అందజేశారు.



మినీ ట్రాక్టరు నడుపుతున్న సెంచూరియన్ వర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థి

ఐదుగురు బాల కార్మికుల గుర్తింపు

రాయగడ: పట్టణంలోని పలు హోటళ్లు, గ్యారేజీలు తదితర వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న ఐదుమంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. జిల్లా శిశు సంరక్షణ సమితి, లేబర్ కార్యాలయానికి చెందిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సాయంత్రం దాడులు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక తుంబిగుడ, సాయిప్రియనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో వారిని గుర్తించి, యాజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గుర్తించిన 5 మందిలో ముగ్గురిని శిశు సంరక్షణ సమితిలో ఉంచి, వారిని చదివించేందుకు ప్రభుత్వం తరుపున అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా మరో ఇద్దరిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉద్యోగాల విక్రయం ఆరోపణలపై

విపక్షం మండిపాటు



స్పీకరు పోడియం చుట్టుముట్టిన విపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు

- స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్ష బీజేడీ
- సభ వాయిదా

భువనేశ్వర్: ఉద్యోగాలు ఎవరు, ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి అమ్మారో ముఖ్యమంత్రి పూర్తి వివరణ సభలో ప్రవేశ పెట్టాలని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ గట్టిగా పట్టుబట్టింది. శనివారం శీతా కాలం సమావేశాల ప్రశ్నోత్తరాల నుంచే బీజేడీ రచ్చకు దిగింది. ఉద్యోగాల భర్తీ, ఏఎస్‌ఓ పోస్టుల అమ్మకాలకు గత ప్రభుత్వం పాల్పడిందని శుక్ర వారం నాటి సభా సమావేశాల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆరోపించారు. ఇటువంటి అక్రమాలు, అవినీతి కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను (అక్రమాల నివారణ) సవరణ బిల్లుని ప్రతిపాదించిందని ముఖ్యమంత్రి పేర్కొనడంపై బిజూ జనతా దళ్ శనివారం విరుచుకు పడింది.

ఈ వ్యాఖ్యపై ముఖ్యమంత్రి సంతృప్తికరమైన వివరణ సభలో ప్రవేశ పెట్టలేని పరిస్థితుల్లో సభా ముఖంగా క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. విపక్షాల దాడితో సభలో వాతావరణం వేడెక్కింది. సభా కార్యక్రమాల్ని ఉదయం 11.30 గంటల వరకు వాయిదా వేసినట్లు స్పీకరు సురమా పాఢి ప్రకటించారు. దీంతో ప్రశ్నోత్తరాలకు గండి పడింది. రూ.30 లక్షలకు ఏఎస్‌ఓ పోస్టులు గత ప్రభుత్వం అమ్ముకుందని ముఖ్యమంత్రి నిండు సభలో ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో లంచం తీసుకున్నది ఎవరు? లంచం ఇచ్చింది ఎవరు? లంచం చెల్లించి ఉద్యోగం పొందింది ఎవరు? అనే అంశాలపై ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ పట్టుబట్టారు. ఈ ఆరోపణలపై బలమైన విచారణ చేపట్టేందుకు ఆదేశించాలని ప్రతిపాదించింది. మరో వైపు వరి కొనుగోలు ప్రాంగణాల్లో మండీల వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. దీన్ని సవరించాలనే నినాదంతో బిజూ జనతా దళ్ వాయిదా తీర్మానంపై చర్చకు ప్రతిపాదించింది.

విపక్షం ఆగ్రహంతో సభా కార్యకలాపాలు ఏమాత్రం ముందుకు సాగలేదు. రెండో సారి సభా కార్యక్రమాల్ని సాయంత్రం 4 గంటల వరకు సభని వాయిదా వేసినట్లు స్పీకరు ప్రకటించారు. అనంతరం ప్రారంభమైన సభా సమావేశంలో కాగ్ నివేదికని ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెసు సభ్యులు రచ్చకు దిగారు. ఎవరి స్థానాలలో వారు నిలబడి పోస్టర్లతో కాంగ్రెసు సభ్యులు నిరసన ప్రదర్శించారు. ఈ దశలో సభా కార్యక్రమాల్ని సోమవారం వరకు వాయిదా వేసినట్లు స్పీకరు ప్రకటించారు.

ముగిసిన రాష్ట్రపతి పర్యటన

- రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన
- దళిత పరిశోధన కేంద్రం ప్రారంభం



బంగిరిపొషి ప్రాంతంలో రైల్వే ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రంలో కొత్తగా మూడు రైలు మార్గాల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. దళిత పరిశోధన, అభివృద్ధి కేంద్రం ప్రారంభించారు. దండ్‌బోష్ విమానాశ్రయం విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5 రోజుల రాష్ట్ర పర్యటన శనివారంతో ముగిసింది. రాష్ట్రపతి పర్యటన మయూర్‌భంజ్ జిల్లాకు వరాలు కురిపించింది. చివరి రోజు పర్యటన కార్యక్రమాలు బంగిరిపొషి కేంద్రంగా జరిగాయి. ఈ సందర్భంగా 3 కొత్త రైలు లైను ప్రాజెక్టులకు శంకు స్థాపన చేశారు. వీటిలో బంగిరిపొషి-గోరుమొహిషాణి, బుడామొరా-చకులియా, బాదంపహాడ్-కెందుఝొరొగొడొ రైలు మార్గాలు ఉన్నాయి. ఈ రైలు మార్గాలు దళిత ప్రభావిత ప్రాంతాల్ని అనుసంధానం చేస్తాయి. ప్రధానంగా మయూర్‌భంజ్, కెంజొహర్ జిల్లాలు లబ్ధి పొందుతాయి. రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతాలకు రైలు అనుసంధానం అందుబాటులోకి వస్తుంది. వర్చువల్‌గా రాయరంగపూర్ ప్రాంతంలో దళిత పరిశోధన, అభివృద్ధి కేంద్రం రాష్ట్రపతి ప్రారంభించారు. దండ్‌బోష్ విమానాశ్రయం విస్తరణ, రాయరంగపూర్ సబ్ డివిజనల్ ఆస్పత్రి కొత్త బ్లాక్ నిర్మాణం కోసం ఆమె శంకుస్థాపన చేశారు.

5 రోజుల రాష్ట్ర పర్యటనలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలు ప్రముఖ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. బుధవారం ప్రారంభమైన పర్యటన శనివారంతో ముగిసింది. తొలి రోజున శ్రీ జగన్నాథుని దర్శించుకుని పూరీ గోపబంధు ఆయుర్వేద కళాశాల వజ్రోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. అదే రోజున పూరీ బ్లూ ఫ్లాగ్ సాగర తీరంలో భారత నావికా దినోత్సవంలో పాల్గొన్నారు. మర్నాడు స్థానిక ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయం 40వ స్నాతకోత్సవానికి హాజరు అయ్యారు. నగరంలో ఖుర్దా జుడిషియల్ కోర్టు సముదాయం రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించారు. శుక్రవారం రాష్ట్రపతి ఆమె జన్మ స్థలం మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బెడా గ్రామ సందర్శించారు. అమితోత్సాహంతో ఆమె గ్రామస్తులతో కలిసి దళిత సంప్రదాయ నృత్యంలో పాలుపంచుకుని జానపద కళాకారుల్లో కొత్త ఉత్సాహం ప్రేరేపించారు.



వర్చువల్‌గా దళిత పరిశోధన కేంద్రం ప్రారంభించిన రాష్ట్రపతి



మయూర్‌భంజ్ జిల్లా పర్యటనలో రాష్ట్రపతి ప్రసంగం

మండీల్లో అక్రమాలు జరగకుండా నిఘా

- బీజేపీ కృషక్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర సాహు



మాట్లాడుతున్న కృషక్ మోర్చ అధ్యక్షుడు సాహు

జయపురం: మండీల్లో అక్రమాలు జరగకుండా బీజేపీ కృషక్ మోర్చ నిఘా పెడుతుందని శాఖ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర సాహు తెలియజేశారు. జయపురం సమితి అంబాగుడలో ధాన్యం సేకరణ వర్క్‌షాపును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండీల్లో రైతులకు ఎటువంటి కష్టం, మోసం జరిగినా కృషక్ మోర్చ ఆందోళన చేపడుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కేవలం హామీలతోనే కాలం గడిపేసిందని ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, ఆర్థిక ఉన్నతికి పలు పథకాలు చేపట్టిందని వెల్లడించారు. క్వింటా ధాన్యం రూ.3,100 లకు కొనుగోలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, ఆ హామీ మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని వెల్లడించారు. బంగాళ దుంపలు పండించే రైతులకు ఒక హెక్టారుకు రూ.58 వేలు ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. వర్క్‌షాపులో కృషక్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత స్వైన్, ఉపాధ్యక్షుడు పులిన్ ప్రకాశ్ పూలన్, ఆర్ఎంసీ డైరెక్టర్ అరుణ భట మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి మృతిపై కొనసాగుతున్న విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థి ముద్దాడ దిలీప్ మృతిపై విచారణ కొనసాగుతోంది. ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ, పోలీసుల విచారణ చేస్తున్నారు. సొసైటీ తరఫున బొబ్బిలి గురుకులం ప్రిన్సిపాల్ కె.రఘునాథరావు శనివారం పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ 2022 జనవరి 25న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంపై ఆరా తీశారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ ప్రిన్సిపాల్ ఎం.గుణస్వామితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తులో ముందుకు సాగే అవకాశం ఉంది. ప్రిన్సిపాల్ విధుల నిర్వహణ, కేర్ టేకర్ల పర్యవేక్షణ, పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు బయటకు ఎందుకు వెళుతున్నారు? విద్యార్థుల వ్యక్తిగత పర్యవేక్షణ వంటి అంశాలపై సొసైటీ అధికారులు విచారణ చేస్తున్నారు.

ఉత్తమ మానవ వనరులతోనే దేశ ప్రగతి



మాట్లాడుతున్న డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తమ మానవ వనరులతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువ భారత్ అంశంపై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, పరిపాలనాధికారి ముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు తగదు



రణస్థలంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

రణస్థలం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను భారతదేశంలోని హిందువులంతా ఖండించాలని బ్రాహ్మణ, హిందూ సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు హిందువులకు రక్షణ కల్పించాలంటూ రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా రావాడ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్ వరదలలో తిండిపెట్టిన ఇస్కాన్ సభ్యులనే హింసించడం తగదన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డగ్లస్ స్కూల్ వద్ద కీస్టోన్ చర్చిలో శనివారం యూత్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ జోయల్ జాన్ ఆధ్వర్యంలో యువత నృత్యాలు చేస్తూ.. గీతాలను ఆలపిస్తూ సందడి చేశారు. అనంతరం కేక్ కటింగ్, కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో లిడియా జాన్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో విశ్రాంత హైకోర్టు జడ్జి



విశ్రాంత జస్టిస్ సీతారామమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

శ్రీకాకుళం అర్బన్: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణస్వామిని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి సీతారామమూర్తి శనివారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘన స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించా రు. అనివెట్టి మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో వై.భద్రాజీ, ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు దివ్యాంగుల జట్టు పయనం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో రాణించి టైటిల్‌తో తిరిగిరావాలని జిల్లా దివ్యాగుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. ఈ నెల 8 నుంచి 12 వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు శనివారం జిల్లా జట్టు ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. ఎమ్మెస్సార్ తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అర్జున్‌రావురెడ్డి,బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



రన్నింగ్ రేస్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం మోనాలిసా దాస్



లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6, 7వ తేదీల్లో శ్రీక్రిష్ణచంద్ర గజపతి కళాశాల క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీలను ప్రధాన ఉపాధ్యాయురాలు మోనాలిసా దాస్ ప్రారంభించారు. పీఈటీలు జగన్నాథ పట్నాయక్, డి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ సహకరించారు. విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో జువెలిన్ త్రో, వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంపింగ్ వంటి పోటీలను నిర్వహించారు. బహుమతి ప్రదానం పాఠశాల వార్షిక వేడుకల్లో అందజేస్తామని హెచ్ఎం తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి

పర్లాకిమిడి: జంగం వీధి శివారులో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (షష్టి) జన్మదినోత్సవం పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాతపట్నం మండలం బైదలాపురం, రోంపివలస, ఏ.ఎస్.కవిటితోపాటు నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. పండితులు వనమాలి మణిశర్మ పత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలను పంచిపెట్టారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



సుబ్రహ్మణ్య స్వామి మూల విరాట్టు



సుబ్రహ్మణ్యస్వామి మందిరం వద్ద భక్తులు

బస్సు బైక్ ఢీ.. ముగ్గురు మృతి



రహదారిపై పడి ఉన్న కిరాన్ సేన్ మృతదేహం



సంఘటన స్థలంలో గూండు భోం మృతదేహం



రోడ్డు పక్కన పడి ఉన్న ప్రతాప్ భోం మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి ఎంవీ 7 గ్రామం వద్ద రోజు శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో మల్కన్‌గిరి నుంచి పోడియాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. మల్కన్‌గిరి సమితి ఎంవీ 86 గ్రామానికి చెందిన గూండు భోం, ప్రతాప్ భోం, కిరాన్ సేన్‌లు గా గుర్తించారు. వీరు బైక్‌ను అతివేగంగా నడుపుతూ బస్సును బలంగా ఢీకొట్టారు. దీంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలిసిన మల్కన్‌గిరి ఐఐసి రీగాన్ కీండో తన సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశారు. మృతదేహాలను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శ్రీకూర్మంలో పోలీస్ పికెట్

గార: శ్రీకూర్మంలో శుక్రవారం రాత్రి ఉప్పాడ రాజేష్ అనే వ్యక్తి హత్యకు గురైన నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మృతుడు రాజేష్ ఇంటి వద్ద, రెడ్డిక వీధిలో పోలీసులు పహారా కాస్తున్నారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ రెల్ల జనార్ధనరావులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. తీవ్రగాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చుక్క రామును మెరుగైన వైద్యం కోసం శనివారం ఉదయం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. రాజేష్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఆరుగురు..!

హత్య ఘటనకు సంబంధించి ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద ఎనిమిది మంది వ్యక్తులకు ఇందులో ప్రమేయం ఉందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. శ్రీకూర్మం సమీపంలోని చింతువలస వద్ద ఉన్న స్థలానికి సంబంధించి రాజేష్ సమీప బంధువు ఉప్పాడ రాములమ్మ, కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉంది. ఈ వివాదంలో జిల్లా కోర్టు, జేసీ కోర్టు, హైకోర్టులో రాములమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చినట్టు తెలుస్తోంది.



మృతుడు రాజేష్ ఇంటి వద్ద పోలీసులు

ఆ తర్వాతే ఉప్పాడ సూర్యనారాయణతో పాటు గాయపడ్డ చుక్క రాము, అనపాన షణ్ముఖరావులు ఆ భూమిని కొనుగోలు చేశారు. దీంతో కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యులు దాడిచేయడానికి ప్రణాళిక వేసుకున్నట్టు భావిస్తున్నారు. ఆ సమయంలో సూర్యనారాయణను కూడా టార్గెట్ చేసినా హైస్కూల్ ప్రహరీకి ఆనుకున్న పాన్‌షాపుల కింద దాక్కోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా, భూ తగాదాలో హతుడు రాజేష్‌కు నేరుగా ప్రమేయం లేదు. సూర్యనారాయణ, రాములమ్మలకు మద్దతుగా ఉన్నాడనే అక్కసుతోనే హత్య చేశారా? పేకాట డెన్ లావాదేవీల వివాదం ఉందా అన్న విషయంపై స్పష్టత లేదు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

శ్రీకాకుళం న్యూకాలనీ: పిల్లల ప్రవర్తనని తల్లిదండ్రులు ప్రతి రోజూ కనిపెడుతుండాలని, ముఖ్యంగా డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శ్రీకాకుళం గుజరాతీపేటలోని ఏపీఎస్ఎంహెచ్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఆలయన మాట్లాడుతూ మాదవ ద్రవ్యాలతో జీవితం నాశనం అవుతున్నారు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ల వల్ల విషయ పరిజ్ఞానం తెలియడంతో పాటు అనర్థాలు కూడా చాలా ఉన్నాయని గ్రహించి విద్యార్థులు మంచి కోసం మాత్రమే మొబైల్ ఫోన్లు వాడాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 'మాదకద్రవ్యాలు వద్దు బ్రో' అనే పోస్టర్లను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, రామనాథరావు, అంధవరపు సంతోష్‌కుమార్, ప్రసాద్ రావు, టూ టౌన్ సీఐ ఈశ్వరరావు, ఎస్సై సంతోష్, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



'మాదకద్రవ్యాలు వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, తదితరులు

మూడేళ్లలో రూ.113 కోట్లు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగింది. గత 3 ఏళ్లలో హుండీ సమగ్ర ఆదాయం రూ. 113 కోట్లుగా రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. రాష్ట్ర శాసన సభలో శనివారం ఈ విషయమై సభ్యులు ప్రస్తావించడంతో భక్తుల నుంచి స్వామి హుండీలో చేరిన ఆదాయం రూ. 113 కోట్లుగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే సనాతన్ మహాకుడు లిఖితపూర్వక ప్రశ్నకు బదులుగా మంత్రి ఈ విషయం సభలో వెల్లడించారు.

నేటి నుంచి చైతీ ఉత్సవాలకు శ్రీకారం



సమావేశంలో పాల్గొన్న బసంత కుమార్, బాగ్, మణిమాల తదితరులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్న చైతీ ఉత్సవాలకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా పద్మపూర్ సమితి మొరిచాగుడ గ్రామం నుంచి ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టేందుకు అధికారులు శనివారం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్, సమితి అధ్యక్షురాలు మణిమాల సాబొరొ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ లిపిని కనిపెట్టిన అక్షర బ్రహ్మ స్వస్థలం మొరిచొగుడ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రారంభమయ్యే ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈనెల 10వ తేదీ నుంచి జిల్లాలోని 11 సమితుల్లో సమితుల వారీగా చైతీ ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు అధికారులు వెల్లడించారు.

చైతీపై ప్రత్యేక పాట



స్టూడియోలో పాట పాడుతున్న సాబొరొ, పలకలు

రాయగడ: ఈ ఏడాది చైతీ ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రప్రథమంగా చైతీపై పాటను రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆదివాసీ భాష, సంస్కృతి, కళలకు అద్దం పట్టే ఈ చైతీ ఉత్సవాలను వృత్తాంతంగా రూపొందించిన సాహిత్యంతో చైతీ గీతాలాపనకు అంతా సిద్ధమైంది. ముఖ్యంగా దివ్యాంగ కళాకారులు పాటను ఆలపించడం కొసమెరుపు. జిల్లాలోని పద్మపూర్ సమితి ఖిల్లాపదర్ గ్రామానికి చెందిన దివ్యాంగ కళాకారుడు లక్ష్మణ్ సాబొరొ, గుడారి సమితి పరిధిలో గల కదమ పంచాయతీ తంగరమ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఫబేమా పలకలు ఈ మేరకు చైతీ గీతాన్ని రాజ్యలక్ష్మీ స్టూడియోస్‌లో పాడారు. ప్రముఖ కళాకారుడు, సాంస్కృతిక విభాగం జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ బొచ్చా పర్యవేక్షణలో రూపొందిన పాట ఒడియాలో గానం చేయడం విశేషం.

'రైతులను మోసగిస్తే సహించేది లేదు'

రాయగడ: పంటలు దళారుల పాలవుతున్నాయని, ఇకపై అలాంటి వాటికి చెక్ పెడతామని బీజేపీ కృషక్ మోర్చ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేశ్వర్ సాహు అన్నారు. ఈ నెల 27 నుంచి ధాన్యం మండీల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని రైతులతో ఆయన స్థానిక సిరిగుడలో గల పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 43 ధాన్యం మండీలు ప్రారంభమవుతున్నాయని, కొంత మంది మిల్లర్లు ధాన్యం కొనుగోలులో మోసం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మారింది.. పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటలను భద్రంగా ఉంచేందుకు రాష్ట్రంలో 58 శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు.

ఘనంగా సెంచూరియన్ 12వ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో గవర్నరు రఘుబర దాస్ ప్రసంగం

భువనేశ్వర్: దేశ సమగ్ర అభివృద్ధికి ఒడిశా పురోగతి కీలకమని, జాతి పురోగతి యువతరం ఆకాంక్ష కావాలని రాష్ట్ర గవర్నరు రఘుబర దాస్ పిలుపునిచ్చారు. సెంచూరియన్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా, ఇస్రో చైర్మన్ డాక్టరు శ్రీధర్ పణికర్ సోమనాథ్ ఇతర ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 2800 మంది ఉత్తీర్ణులు అతిథుల చేతుల మీదుగా ధృవపత్రాలు అందుకున్నారు. మరో 47 మందికి గవర్నరు ఇతర ప్రముఖులు డాక్టరేట్లు ప్రదానం చేశారు.



స్నాతకోత్సవానికి హాజరైన ప్రముఖులు

ఉరిమే ఉత్సాహం..



ఆటల పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ క్రీడాకారులు

- ఆటల పోటీల్లో సత్తా చాటిన దివ్యాంగులు

జయపురం: దివ్యాంగులకు తగిన ప్రోత్సాహం అందిస్తే అన్ని రంగాల్లోనూ సత్తా చూపగలరని జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశ్యా రెడ్డి అన్నారు. జయపురం ఫూల్‌బెడ గ్రామ సమీపంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో శనివారం దివ్యాంగుల ఆటల పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన దివ్యాంగులను రాష్ట్ర స్థాయిలో జరుగనున్న దివ్యాంగుల క్రీడా పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవాల సందర్భంగా మొదటిసారి దివ్యాంగులకు ఆటలు పోటీలు నిర్వహించారు. పరుగు పందాలు, వీల్‌చైర్, షాట్‌పుట్, బ్లైండ్ రేస్ పోటీల్లో సత్తా చూపారు. అతిథులు, అధికారులు దివ్యాంగుల ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఈ ఆటల పోటీలను తిలకించిన ప్రజలు ఉత్సాహంతో జేజేలు కొట్టారు.

ఈ పోటీల్లో జిల్లాలోని 14 సమితుల నుంచి 4 పురపాలక పరిషత్‌ల నుంచి 147 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వీల్‌చైర్ రేస్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డిప్యూటీ కలెక్టర్ దేవేంద్ర కుమార్ రౌత్, కొరాపుట్ జిల్లా దవలప్‌మెంట్ అధికారి డాక్టర్ దేవాశిశ్ గౌడ, జయపురం తహసీల్దార్ సత్యసాయి జెన, కొరాపుట్ తహసీల్దార్ సయ్యద్ శిబిర సాహు, జిల్లా సామాజిక అధికారి తరుణ తపస్ ప్రహరాజ్ పాల్గొన్నారు.

బస్సులు నిలుపుదల చేయాలని వినతి



బస్సులు నిలపాలని కోరుతున్న బాధితులు

జయపురం: పాతబస్టాండ్ వద్ద బస్సులు నిపుదల చేయాలని కలాసీలు, చిరు వ్యాపారులు, ఆటో పుల్లర్స్ ప్రభుత్వ అధికారులను విన్నవించారు. జయపురంలో కొత్త బస్టాండ్ ప్రారంభించిన తరువాత తమ వ్యాపారాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశా రెడ్డిని కలిసి తమ గోడు వినిపించారు. తామంతా చిన్న, చిన్న దుకాణాలు, టీ, టిఫిన్ షాపులు, ఆటోలు నడిపి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఎప్పటిలాగే జాతీయ రహదానిపై బస్సులు నిలిపేందుకు అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. లేకపోతే ఆత్మహత్యలు చేసుకోవటం తప్ప.. మరోమార్గ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

కాశీబుగ్గ: అంతర్ కళాశాలల ఖోఖో పురుషుల, మహిళ ఎంపిక పోటీలు శనివారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో హోరాహోరీగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. మహిళల విభాగంలో ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల(కాశీబుగ్గ) ప్రథమ, ఎస్‌పీఎస్ఆర్ డిగ్రీ కళాశాల(రాజాం) ద్వితీయ, అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ తృతీయ స్థానాలు సాధించాయి. పురుషుల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రథమ, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ, బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, అంబేద్కర్ వర్సిటీ డీన్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ భాస్కరరావు, పీడీ డాక్టర్ పి.మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వండి

టెక్కలి: సొంత గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని విదేశాల్లో స్థిరపడిన వారంతా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సాయం అందజేసే విధంగా జన్మభూమి–2 కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. శనివారం కోటబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పలు పాఠశాలలను ఎత్తేయడంతో గోదాములుగా మారాయని చెప్పారు. త్వరలోనే డీఎస్సీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలను ధీటుగా మార్చేందుకు తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేయడానికి ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జనాభా పెరుగుదలకు సీఎం చంద్రబాబు ప్రత్యేక నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి కట్టడికి ఈగల్ సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, మండల విద్యా శాఖాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పీటీఎం సమావేశంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

క్లుప్తంగా

వరిచేను కుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో వరిచేను కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కౌలురైతు పాలవలస గోవిందరావు రెండున్నర ఎకరాల్లో పండించిన వరి పంటను కళ్లంలో కుప్పగా పెట్టుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కళ్లం నుంచి మంటలు రావడంతో వెళ్లి చూడగా.. వరిచేను కుప్పలు కాలిపోతున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎవరో కావాలనే కుప్పలకు నిప్పు పెట్టారని బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. ఎస్సై నీలావతి, రెవెన్యూ అధికారులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదంపై ఆరా తీశారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

పాలకొండ రూరల్: చెక్‌బౌన్స్ కేసులో పాలకొండ పట్టణానికి చెందిన కింతలి సంతోష్‌కుమార్ అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదుదారుకు రూ. 9.80 లక్షలు చెల్లించాలని స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎ. విజయ రాజ్‌కుమార్ శనివారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన ఖండాపు విష్ణుమూర్తి నాయుడు పాలకొండ పట్టణానికి చెందిన కింతలి సంతోష్‌కుమార్‌కు కొంత మొత్తం అప్పుగా ఇచ్చారు. ఈ అప్పు తిరిగి చెల్లించే క్రమంలో సంతోష్‌కుమార్ అందించిన చెక్ బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడు 2017లో స్థానిక న్యాయస్థానంలో చెక్‌బౌన్స్ కేసు వేశారు. వాదోపవాదనలు విన్న పిదప న్యాయమూర్తి సంతోష్‌కుమార్‌కు జైలు శిక్షతో పాటు నగదు చెల్లించాలని తీర్పిచ్చారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోండి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: ఫిట్‌నెస్ లేని బస్సులను తనిఖీ చేసి సంబంధిత పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బాలగుడబ సమీపంలో పాఠశాల బస్సు బోల్తా పడడం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన క్లీనర్‌కు పాఠశాల యాజమాన్యం నుంచి రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని కోరారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న బస్సులను సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భీమరాజు, నాయకులు వికాస్, తదితరులు పాల్గొన్నారు.

గురువులకే రక్షణ కరువు..

విజయనగరం: ఉత్తమ పౌర సమాజాన్ని తయారు చేసే ఉపాధ్యాయులకు రక్షణ కొరవడిందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఓనమాల దగ్గర నుంచి ప్రపంచ జ్ఞానాన్ని నేర్పించే గురువులపై విద్యార్థులే దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వారం రోజుల కిందట కర్నూలు జిల్లాలో ఒక ఉపాధ్యాయుడిపై 9వ తరగతి విద్యార్థులు దాడి చేసి హత్య చేసిన ఉదంతం మరవకముందే.. మధ్యప్రదేశ్‌లోని ఓ కళాశాల ప్రధానాచార్యుడిని ఇంటర్ విద్యార్థి తుపాకితో కాల్చి చంపడం చూస్తుంటే ఈ సమాజం ఎటు పయనిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకే రక్షణ కొరవడితే దేశ భవిష్యత్ ఏమవుతుందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి ఉషు పోటీలకు యశ్మిత

విజయనగరం: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఉషు పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అర్హత సాధించింది. ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకు ఢిల్లీలో జరగనున్న అండర్ - 19 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్టుకు విక్రమ్ యశ్మిత ఎంపికైంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ మేరకు విద్యార్థినిని స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

మరీ అంత అలుసా..!

- ఆరు నెలలైనా అంగన్‌వాడీ చిన్నారులకు అందని పుస్తకాలు
- పలకలే చిన్నారులకు దిక్కు
- జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2,499
- ఆయా కేంద్రాల్లో 20,326 మంది చిన్నారులు



విజయనగరం కంటోన్మెంట్ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రంలో పలకలపై రాస్తున్న చిన్నారులు


విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ చిన్నారుల చదువు పట్ల కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. చిన్నారులకు అవసరమైన పుస్తకాలు కూడా అందించలేని దుస్థితిలో కూటమి సర్కారు ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన వసతులతో కూడిన విద్య అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు పలక, బలపమే దిక్కయ్యాయి. పుస్తకాలు లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది పలకలపై అక్షరాలు రాయిస్తున్నారు.

2499 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 2,206 కాగా మినీ కేంద్రాలు 293. ఆయా కేంద్రాల పరిధిలో 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 20.326 మంది ఉన్నారు.

గతంలో కాన్వెంట్‌లకు దీటుగా..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది అంతా పేద పిల్లలే. వీరికి కాన్వెంట్ స్థాయి విద్య అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఈ నేపథ్యంలో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ-1, పీపీ-2 కిట్లను అందించారు. కాన్వెంట్ తరహాలో బోధన అందించడంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించారు. దీంతో 3 నుంచి 4 సంవత్సరాల లోపు పిల్లలకు ఇంగ్లిష్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌లకు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు.. 4 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ - 2 కిట్లు అందించారు.



పీపీ-1 పుస్తకాలు



పీపీ-2 పుస్తకాలు

ప్రస్తుతం పుస్తకాలే లేవు..

ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలు నీరసించిపోయాయి. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందు పాఠశాల విద్యార్థులకు గాని అంగన్‌వాడీ చిన్నారులకు గాని పుస్తకాలు అందించాలి. కాని విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు కేంద్రాలకు పుస్తకాలు చేరుకోలేదు. పీపీ -1, పీపీ- 2 కిట్లు అందకపోవడంతో చిన్నారులకు చదువు చెప్పేందుకు కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఎప్పుడు పుస్తకాలు మంజూరు చేస్తుందా అని అటు చిన్నారులు, ఇటు సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

వచ్చిన వెంటనే అందజేస్తాం..

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగానే నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఇంతవరకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు రాలేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. వచ్చిన వెంటనే చిన్నారులకు అందిస్తాం. – బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారి

పంటి బిగువున బాధతో..

- కుమారుడి మృతదేహంతో 70 కిలోమీటర్ల ప్రయాణం
- అందుబాటులో లేని అంబులెన్స్ సేవలు
- తోటి ప్రయాణికులకు అనుమానం రాకుండా బస్సులో 35 కిలోమీటర్లు
- అనంతరం బైక్‌పై మరో 35 కిలోమీటర్ల ప్రయాణం
- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు
- ఆలస్యంగా వెలుగులోకి..



చిన్నారి రోహిత్ మృతదేహం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): రెండు నెలల చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఓ నిరుపేద గిరిజన తండ్రికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్స్ లభించని దుస్థితి నెలకొంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ హృదయ విదారకర సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి అశోక్, శ్రావణిల కుమారుడు రోహిత్‌కు (రెండు నెలలు) ఒంట్లో బాగోలేకపోవడంతో ఈ నెల మూడో తేదీన గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో అక్కడి వైద్యాధికారి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. శ్వాసకోశ ఇబ్బందులతో చికిత్స పొందుతున్న రోహిత్ మరునాడు బుధవారం రాత్రి జిల్లా ఆస్పత్రిలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో బాధను దిగమింగుతూ.. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్ కేటాయించాలని బాలుడి తండ్రి అశోక్ ఆస్పత్రి సిబ్బందిని కోరాడు. అయితే అంబులెన్స్ రిపేర్‌లో ఉందని సిబ్బంది చేతులెత్తేశారు. ఐటీడీఏకు సంబంధించిన అంబులెన్స్ సమకూరుతుందేమోనని ప్రయత్నించినప్పటికీ అది కూడా లభించలేదు. దీంతో చేసేది లేక గుండె రాయిచేసుకుని మృతదేహం ఉన్నట్లు తోటి ప్రయాణికులకు అనుమానం కలుగకుండా ఆర్టీసీ బస్సులో 35 కిలోమీటర్లు ప్రయాణం చేసి కురుపాంలో దిగాడు. అక్కడ నుంచి బంధువుల ద్విచక్ర వాహనంపై మరో 35 కిలోమీటర్లు బాలుడి మృతదేహంతో స్వగ్రామానికి చేరుకున్నాడు. బిడ్డ మృతదేహాన్ని గ్రామానికి తెచ్చుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఇటువంటి పరిస్థితి పగవాడికి కూడా రాకూడదని తల్లిదండ్రులు స్వాతి, అశోక్ కన్నీటిపర్యంతమయ్యారు.

గతంలో ఫోన్ చేయగానే ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆస్పత్రి వద్ద అంబులెన్స్‌లు నిత్యం అందుబాటులో ఉండేవి. ఒకవేళ అందుబాటులో లేకున్నా ఒక్క ఫోన్‌కాల్ చేయగానే అంబులెన్స్ క్షణాల మీద చేరుకుని.. ఏ మారుమూల గ్రామానికైనా బాధితులను చేర్చేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

జింక మృతి

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామ సమీపంలో జింక మృతి చెంది ఉందని డీఆర్ఓ రవి బాబు శనివారం తెలిపారు. ఈ విషయాన్ని పశువైద్యాధికారి పి. చైతన్యశంకర్‌కు తెలియజేయగా...అయన వచ్చి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అజీర్తి వల్ల జింక మృతి చెందినట్లు పశువైద్యాధికారి తెలిపారు.



జింక కళేబరం

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి..

- ఎల్‌అండ్‌టీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, జీఎంఆర్

రాజాం: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, 35 ఏళ్ల లోపు చేరుకోవాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యన్ అన్నారు. రాజాంలోని జీఎంఆర్ ఐటీని జీఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావుతో కలసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూరదృష్టి, నిరంతర కృషితో అనుకున్న స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. భారతదేశంలో మౌలిక సదుపాయాల ఆవశ్యకతను, ఎల్‌అండ్‌టీ సంస్థ సాధించిన విజయాలు వెల్లడించారు. అంతకుముందు జీఎంఆర్ గ్రూపుల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, నైరేడ్ సేవలు, జీఎంఆర్ విద్యాసంస్థలు, లక్ష్యాలు, చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, కేర్ ఆస్పత్రి ఎం.డి డాక్టర్ రాజేంద్ర, అన్నంనాయుడు, జీఎంఆర్ విద్యాసంస్థల ప్రతినిధులు, కేర్ ఆస్పత్రి వైద్యులు, నైరేడ్ నిర్వాహకులు, జీఎంఆర్ గ్రూప్స్ ఉద్యోగులు, విద్యార్థులు, జీఎంఆర్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న విజయనగరం క్రీడాకారులు

- సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్న వైనం



సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో విజయనగరం క్రీడాకారులు

విజయనగరం: జీవీకేఎల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. 65 ప్లస్ వయస్సు డబుల్స్ విభాగంలో సన్యాసిరాజు, శ్రీనివాస్‌రెడ్డి జోడీ విజేతలుగా నిలిచారు. 45 ప్లస్ విభాగంలో సౌమిత్రి, దినకర్‌రెడ్డి ఫైనల్స్‌కు చేరుకున్నారు. జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడలో సౌమిత్రి , సన్యాసిరాజు ఇప్పటికే అనేక ట్రోఫీలు సొంతం చేసుకున్నారు. పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు వెంకటఅప్పారావు, రాంబాబు, గాంధీ, చీఫ్ కోచ్ ఫెడ్రిక్, మల్లిక్, తదితరులు అభినందించారు.

యువత 'అగ్నిపథ్'లో చేరాలి

- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అథారిటి కార్పొరల్ సందీప్



సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అథారిటి కార్పొరల్ సందీప్

పార్వతీపురం టౌన్: యువత అగ్నిపథ్ స్కీమ్‌లో చేరేలా అడుగులు వేయాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అథారిటి కార్పొరల్ సందీప్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మృత్యుంజయ ఆడిటోరియంలో అగ్నిపథ్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ అథారిటి నుంచి కార్పొరల్ సందీప్, సార్జెంట్ ఎస్‌డీ ఝూట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో యాభై శాతం మార్కులు సాధించగలిగితే ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగానికి అర్హత ఉంటుందన్నారు. ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులకు అగ్నిపథ్ స్కీమ్ కాకుండా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెన్స్ స్కీమ్ ఉందన్నారు. దీనికి ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేకంగా నియామకం చేపడుతుందని తెలిపారు. మెడికల్ అసిస్టెన్స్ స్కీమ్‌లో చేరిన యువతకు పెన్షన్‌తో కూడిన 20 సంవత్సరాల ఉద్యోగాల కాల పరిమితి ఉంటుందని పేర్కొన్నారు. బైపీసీ చదువుకున్న అమ్మాయిలు మిలటరీ నర్సింగ్ సర్వీసులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిణి డి.మంజుల వీణ, కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్షయ'ను తరిమికొట్టాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ వాకాటి

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధిని సమాజం నుంచి తరమికొట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ వాకాటి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో టీబీ ఎలిమినేషన్ వంద రోజుల పైలెట్ ప్రోగ్రాంను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకినా భయపడాల్సిన పని లేదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడి మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చునని తెలిపారు. క్షయ వ్యాధి నుంచి బయటపడిన వారు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయనగరం క్షయ రహిత జిల్లాగా చేయడానికి కృషి చేయాలని కోరారు. కోవిడ్‌ను తరిమికొట్టినట్టే క్షయవ్యాధిని తరిమికొట్టాలన్నారు. క్షయ వ్యాధిని త్వరగా గుర్తించాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. క్షయ వ్యాధిపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. స్వయం సంఘాల మహిళలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం రెడ్ క్రాస్ వారు సమకూర్చిన పౌష్టికాహార కిట్లను 14 మంది క్షయ రోగులకు అందజేసారు. ఆ తర్వాత గ్రామాల్లో క్షయ వ్యాధిపై ప్రచారం చేసే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షయ నివారణ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, రాష్ట్ర వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ దేవి, జిల్లా క్షయ నివారణ అధికారి, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి అభివృద్ధి ఫలాలు..

- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



శిక్షణలో పాల్గొన్న మాస్టర్ ట్రైనీలు

విజయనగరం రూరల్: అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికాధికారి బీవీ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గడిచిన నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. నేటితో శిక్షణ పూర్తవుతుందని, శిక్షణ పొందిన వారు మండల స్థాయి సిబ్బందికి ఈ నెల 10వ తేదీ నుంచి 19 వరకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌డీపీఆర్ కన్సల్టెంట్ నాగరాజు, సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ సభ్యులు శ్రీనివాసరావు, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్..

దూసుకొచ్చిన మృత్యువు..

- గొర్రెలు తోలుతుండగా ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- సంఘటనా స్థలంలోనే ఒకరి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- 15 గొర్రెలు మృత్యువాత



మహేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



సంఘటనా స్థలంలో మృతి చెందిన మహేష్, గొర్రెలు (ఇన్‌సెట్లో) మహేష్(ఫైల్)

దత్తిరాజేరు: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెదమానాపురం ఎస్సై జయంతి, బాధిత కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెదమానాపురం వారపు సంతకు వంగర గ్రామానికి చెందిన గంజి మహేష్, కొలుసు రమణ, తిరంగి నరసింగరావులు శనివారం ఉదయం గొర్రెలు తీసుకువస్తున్నారు. సరిగా సంతకు కూతవేటు దూరంలో ఉన్న వంతెన దగ్గరకు వచ్చే సరికి పార్వతీపురం నుంచి విజయనగరం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి దూసుకువచ్చింది. దీంతో గంజి మహేష్, 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా.. కొలుసు రమణ, తిరగంగి నరసింగరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో కొలుసు రమణ పరిస్థితి విషమంగా ఉంది. రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోవడం.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో వంగర గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో వృద్ధురాలి మృతి



సంఘటనా స్థలంలో పారమ్మ మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామానికి చెందిన కండేన పారమ్మ (82) కుక్కల దాడిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. ఊరి పొలిమేరలో శనివారం సాయంత్రం పచ్చగడ్డి కోస్తుండగా.. ఒకేసారి నాలుగు కుక్కలు దాడి చేయడంతో పారమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఓ యువకుడి ద్వారా విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెళ్లి చూడగా... పారమ్మ మృతదేహం ఛిద్రమై కనిపించింది. ముఖం, తొడలను కుక్కలు పూర్తిగా కొరికేశాయి. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గతంలో కూడా బహిర్భూమికి వెళ్లి బంటు లక్ష్మి అనే మహిళ కుక్కల దాడిలో మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. కుక్కల దాడి నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చాకుతో దాడి..



చికిత్స పొందుతున్న బాధితుడు దుర్గారావు

బలిజిపేట: ఇద్దరు వాదులాడుతుండగా.. సర్ది చెప్పడానికి వెళ్లిన వ్యక్తి వారిలో ఒకరిపై దాడి చేసిన సంఘటన శనివారం జరిగింది. ఎస్సై సింహాచలం తెలియజేసిన వివరాల ప్రకారం... బలిజిపేటలో మతి స్థిమితం లేని దుర్గారావు, మూగ, చెముడుతో ఉన్న ఎస్.శశిల మధ్య ఘర్షణ జరిగింది. వీరివురు వాదులాడుతుండగా.. వెంగాపురానికి చెందిన వీరాచారి అనే వ్యక్తి వారిని సముదాయించబోయాడు. దీంతో దుర్గారావుతో వీరాచారికి మాటామాటా పెరగడంతో వీరాచారి తన వద్ద నున్న చిన్న కత్తితో దాడి చేశాడు. దుర్గారావు మెడ, చేతుల మీద గాయం కావడంతో స్థానికులు అతడ్ని బలిజిపేట పీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి తల్లి ఆర్. మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సింహాచలం తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



తూలుగు తవిటమ్మ (ఫైల్)

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన తూలుగు తవిటమ్మ (47) పాము కాటుతో శనివారం మృతి చెందింది. పొలంలో వరి చేను ఎత్తుతుండగా.. పాము కరవడంతో వెంటనే ఆమెను మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త గోపాలకృష్ణతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతురాలి పెద్దకుమార్తె ద్రాక్షాయణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్. గోపాలరావు తెలిపారు.